# సర్కారు వైఫల్యాలను ఎండగడుదాం

- అట్టడుగువర్గాల యువత రాజకీయంగా ఎదగాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆరెకులస్తులతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

దహెగాం, ఫిబ్రవరి 23 : గల్లిగల్లీకి తిరిగి కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎండగడుదామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఆపై మండలకేంద్రంలో కార్యకర్తలతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విషయాన్ని పల్లె పల్లెనా తిరిగి ప్రజలకు తెలియజేయాలని, వాడల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అట్టడుగు వర్గాల యువత రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాల పాటు కొందరి చేతుల్లోనే రాజకీయాలు ఉంటున్నాయని, అధికారం ఏ పార్టీ చేతుల్లో ఉన్నా నడిపించేది మాత్రం యువతేనని చెప్పుకొచ్చారు.

### ఓబీసీ కోసం కృషి చేస్తా

ఆరే కులస్తులు ఆర్ఎస్పీని కలిసి తమ సమస్యను వివరించారు. తమకులం బీసీ–డీలో ఉందని, ఓబీసీ జాబితలో చేర్చేలా కృషి చేయాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ కోసం కృషి చేస్తానన్నారు. ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్రంతో మాట్లాడుతానన్నారు. ఈ విషయమై ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీతో ఫోన్‌లో మాట్లాడారు. నియోజవర్గం ఇన్‌చార్జి లెవడుగురి శ్యాంరావు, నాయకులు సలీమ్, యువత అధ్యక్షులు కాశిపాక రాజు, శాకీర ఎల్కరి ప్రశాంత్, దందెర మల్లేశ్, రంగు సందీప్, చాపిడి సూరి, సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చప్పిడ తిరుపతి పాల్గొన్నారు.



నీటి బిందెలతో అడవిమార్గం గుండా గ్రామానికి వెళ్తున్న గిరిజనులు

# నీటి గోస పట్టదా?

## వేసవికి ముందే తిప్పలు పడుతున్న లొద్దిగూడ

- గుక్కెడు నీటి కోసం అడవిబాట పడుతున్న గిరిజనం
- నాలుగు కిలోమీటర్లు నడిచి చెలిమెల నీళ్లు తెచ్చుకుంటున్న వైనం
- మరమ్మతులకు నోచుకోని సోలార్ పంపుసెట్
- బడ్జెట్ లేదంటూ దాటవేస్తున్న అధికారులు
- కేసీఆర్ సర్కారులో రంది లేకుండేనంటున్న గ్రామస్తులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జైనూర్ మండలం లొద్ది గ్రామంలో వేసవికంటే ముందే తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. దాహార్తిని తీర్చుకునేందుకు కిలోమీటర్ల కొద్ది నడిచి, చెలిమెల నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ద్వారా ఎంచక్కా నీరు సరఫరా చేయగా, ప్రస్తుత ప్రభుత్వ పట్టింపులేని తనంతో గొంతు తడవడం లేదని గిరిజనం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.

### కేసీఆర్ సర్కారులో నిత్యం సరఫరా

లొద్దిగూడ గ్రామంలో దాదాపు 200 కుటుంబాలు ఉంటాయి. కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలు బిగించారు. కానీ, పైపులైన్లు వేయడంలో కొన్ని సమస్యలు ఎదురుకాగా, ఇంటింటికీ నీరందించడం వీలుకాలేదు. దీంతో గ్రామంలో సోలార్ పంప్‌ను ఏర్పాటు చేసి 3 కిలోమీటర్ల దూరంలోనున్న వాగు నుంచి పైపులైన్ వేశారు. దాదాపు నాలుగేళ్లు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిత్యం తాగునీరు సరఫరా చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. సోలార్ పంపుకు మరమ్మతులు చేసే నాథుడు లేక గతేడాది నుంచి నీరు సరఫరా కావడం లేదు. దీంతో గిరిజనలకు తాగు నీటి తిప్పలు మొదలయ్యాయి.

### నాలుగు కిలోమీటర్లు నడిచి..

లొద్దిగూడ గ్రామ గిరిజనులు నాలుగు కిలోటర్లు అడవిలో నడిచి వెళ్లి వాగులో నుంచి చెలిమెల నీరును తెచ్చుకోవాల్సి వస్తోంది. కేవలం నీటిని తెచ్చుకునేందుకే రోజంతా పనులు వదులుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పశువులను వాగు వద్దకు తీసుకెళ్లి నీటిని పెడుతున్నారు. చెలిమెలు ఏర్పాటు చేసుకొని పశువుల దాహాన్ని తీరుస్తున్నారు. అడవిలో నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోనున్న వాగుకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఇకనైనా సర్కారు స్పందించి తాగు నీరందించేలా చూడాలని గిరిజనులు వేడుకుంటున్నారు.



### బడ్జెట్ లేదంటున్నరు



*జైనూర్, ఫిబ్రవరి 23 : కొన్ని రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సోలార్ పంపుకు రిపేరు చేయమని గ్రామ పంచాయతీ సార్లను అడిగితే బడ్జెట్ లేదని చెబుతున్నరు. మూడు నాలుగేళ్ల క్రితం రూ. 3 లక్షలతో అప్పటి కలెక్టర్ సార్ మాకు సోలార్ సిస్టం బిగించి.. ట్యాంక్‌ను కొనిచ్చిండు. ఇప్పుడది పనిచేయక తాగు నీటికి గోసైతంది. ఇకనైనా మా ఇబ్బందులను చూసి తాగు నీరందించాలి.*

**- మెస్రం రాజేశ్, లొద్దిగూడ**

### చెలిమెల నీళ్లే దిక్కయినయి



జైనూర్, ఫిబ్రవరి 23 : మా ఊరిలో సోలార్ పంపుసెట్ పనిజేస్తలేదు. తాగు నీటికి అరిగోస పడుతున్నం. కాలినడకన వెళ్లి వాగులో చెలిమెలు తోడుకొని నీళ్లు తెచ్చుకుంటున్నం. ఇగ ఎండాకాలం ముదిరితే గా నీళ్లుకూడా దొరకవు. ఆఫీసర్లు చేస్తమంటున్నరుగాని.. చేసింది లేదు. కనీసం బోరు వేసి అయినా నీటి గోస తీర్చాలి.

**- మెస్రం రాధాబాయి, లొద్దిగూడ**



వాగులో చెలిమె నుంచి నీటిని తోడుతున్న లొద్దిగూడ గిరిజనులు

# మేము ప్రారంభించిన పనులన్నీ పూర్తి చేయాలి

## మంచిర్యాల-అంతర్గాం మధ్యే బ్రిడ్జి నిర్మించాలి

- జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డిని కోరిన మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆగడాల నుంచి కాపాడాలని విజ్ఞప్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 23 : మా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులన్నీ ప్రత్యేక చొరవ చూపి పూర్తిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. సీఎం మంచిర్యాల పర్యటన నేపథ్యంలో ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ సర్కారు రద్దు చేసిందని, వాటిని వెంటనే పునఃప్రారంభించాలని కోరారు. మంచిర్యాల–అంతర్గాం బ్రిడ్జిని మంచిర్యాల గోదావరి మీది నుంచే నిర్మించాలని, రూ.164.00 కోట్లతో మంజూరు, అగ్రిమెంట్ అయిన బ్రిడ్జి పనులను మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని, దీని వలన హైదరాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ప్రయాణం చేసే వారికి 18 కి.మీ. దూరం తగ్గుతుందన్నారు. కానీ, స్థానిక ఎమ్మెల్యే ఈ బ్రిడ్జిని ముల్కల్ల నుంచి ముర్మూర్ మీదుగా నిర్మించాలని ప్రతిపాదన చేస్తున్నారని, ముల్కల్ల నుంచి ముర్మూర్ మీదుగా అంతర్గాం వరకు గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే రూ.450.00 కోట్ల ఖర్చు పెరగడమేగాక, 8 కి.మీ. మేర భూ సేకరణ చేయాల్సి ఉంటుందని, ఇవన్నీ చేసినా హైదరాబాద్ వెళ్లడానికి కేవలం 5 కి.మీ దూరం మాత్రమే తగ్గుతుందన్నారు. కావున ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకొని గతంలో మాదిరిగానే మంచిర్యాల – అంతర్గాం మధ్యనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. 5 కిలోమీటర్ల దూరం తగ్గడానికి రూ.450 కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టడము అవసరమా ? అని ప్రశ్నించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి నదిలో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు నేతృత్వంలో ఇసుక, మట్టిని తోడి అక్రమంగా వందలాది లారీల్లో తరలించి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాలను మాఫియా మంచిర్యాలగా మార్చారని, అతని ఆగడాలను నియంత్రించి మంచిర్యాలను కాపాడాలని కోరారు. గడిచిన 15 నెలల్లో మంచిర్యాలలో ఎక్కడ చూసినా దాడులు, కొట్లాటలు, తప్పుడు కేసులు పెట్టడమే తప్ప ఎమ్మెల్యే చేసిందేమీ లేదని, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు.. ఇలా ఎవరు తనకు ఎదురు మాట్లాడినా అక్రమ కేసులతో జైల్లో పెట్టిస్తున్నాడని, తన మనుషులతో కొట్టిస్తున్నాడని ఆరోపించారు. మంచిర్యాలలో కొనసాగుతున్న సంస్కృతిని సీఎం దృష్టికి తీసుకువస్తున్నామని, ఇకనైనా మార్పురాకపోతే బీఆర్ఎస్ పార్టీ పరంగా ఉద్యమాలు చేపడుతామని చెప్పుకొచ్చారు. ఐటీ పార్క్ పేరిట దళితుల భూములను ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు లాక్కుంటున్నారని, వేంపల్లి గ్రామ శివారులో ఇండస్ట్రియల్ హబ్, ఐటీ పార్క్ ఏర్పాటు కోసం సేకరిస్తున్న 300 ఎకరాల భూమికి, ఎకరానికి రూ. 13 లక్షల చొప్పున పరిహారం ప్రకటించడం దారుణమన్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ పరిహారం తక్కువగా నిర్ణయించారని, ప్రస్తుతం అక్కడ పట్టా భూమికి ఎకరానికి రూ. 50 లక్షల వరకు పలుకుతుందన్నారు. దళిత రైతులను బెదిరించి, రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఓ ఫంక్షన్ హాల్‌కు రైతులను పిలిపించి మాయమాటలు చెప్పి, భయభ్రాంతులకు గురిచేసి అక్రమంగా వారి భూములను తీసుకోవడం దారుణమన్నారు. ఇది కేవలం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు లబ్ధి పొందడానికి మాత్రమే చేస్తున్న ప్రక్రియ అని అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ రైతుల పక్షాన పోరాడుతామని, వారికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ , మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు తోట తిరుపతి, తాజొద్దీన్, శ్రీరాముల మల్లేశ్, జాఫర్, గరుగంటి కొమురయ్యా, మహ్మద్ రఫీ, కర్రు శంకర్, పడాల రవీందర్, పడాల శ్రీనివాస్, పెంట ప్రదీప్, నస్పూరు పట్టణ అధ్యక్షుడు అక్కురి సుబ్బన్న, మాజీ కౌన్సిలర్ బేర సత్యానారాయణ, నాయకులు మెరుగు పవన్, బండారి తిరుపతి, వడ్లకొండ రవి గౌడ్, కాటంరాజు మహమ్మద్ సాజిద్ పాల్గొన్నారు.

# సీఎం వస్తున్నారని స్కూళ్లకు సెలవు

మంచిర్యాలటౌన్/సీసీసీ నస్పూర్/నస్పూర్, ఫిబ్రవరి 23 : ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు నేడు సీఎం రేవంత్ రెడ్డి మంచిర్యాల జిల్లాకు వస్తున్న నేపథ్యంలో స్కూళ్లకు సెలవులు ఇచ్చుకున్నారు. నస్పూరులోని కలెక్టరేట్ భవన సమీపంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభ కోసం పలు ప్రైవేట్ స్కూళ్లకు యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. జిల్లాలో రెండు ట్రస్మాలు ఉండగా, ఒకవర్గం సంత్‌లాల్ జయంతి సందర్భంగా సెలవు ఇస్తున్నట్లు ప్రకటించగా, మరో వర్గం సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సెలవు ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల యాజమాన్యాలపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల మద్దతు కోసం ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించి, టీచర్లను కూడా మీటింగ్‌కు తరలిస్తారేమోనని వారు ఆరోపిస్తున్నారు. కాగా, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సభకు హాజరుకానున్నారు.

